

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
3
శనివారం 13 జూలై 2024



కొత్త రేషన్ కార్డుల జారీ ఎప్పుడో!





'సిద్దిపేటకు చెందిన అనిల్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొత్త రేషన్‌కార్డు కోసం తన పేరు, భార్య పేరుతో దరఖాస్తు చేశాడు. కొత్త కార్డు సంగతి పక్కనపెడితే ఉమ్మడి కుటుంబం కార్డు నుంచి కూడా వారి పేర్లు తొలగించారు. కొడుకు పుట్టినా రేషన్‌కార్డు రాలేదు. దీంతో, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యాడు.'

- ఆరేళ్లుగా అర్హులకు నిరాశే..
- ఉమ్మడి జిల్లాలో లక్షకు పైగా దరఖాస్తులు
- అధికారుల లాగిన్లలోనే పెండింగ్
- 'ప్రజాపాలన'లోనూ విన్నపాలు
- సంక్షేమ పథకాల అర్హతకు ఆటంకం
- సీఎం ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 12: అనిల్ లాగే కొత్త రేషన్‌కార్డుల కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న వారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షకు చేరింది. 2018 నుంచి ఇప్పటి వరకు రేషన్‌కార్డుల జారీ పూర్తిగా నిలిపివేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఆశావహుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తహసీల్దార్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలసిపోయారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలోనూ కొత్త కార్డుల వెతలు వినిపించేవి. పార్లమెంటు ఎన్నికలు ముగియగానే కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపడతామని సీఎంతోపాటు పలువురు మంత్రులు ప్రస్తావించినా జాప్యం జరుగుతోంది.

వేలాది దరఖాస్తులు పెండింగ్

సంగారెడ్డి జిల్లాలో 3,78,582 రేషన్‌కార్డులు, సిద్దిపేట జిల్లాలో 2,91,445 రేషన్‌కార్డులు, మెదక్ జిల్లాలో 2,13,873 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటికి తోడు కొత్త రేషన్‌కార్డుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే అధికారుల లాగిన్లలో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించింది. ఇందులోనూ ఆరు గ్యారంటీలతోపాటు రేషన్‌కార్డుల కోసం భారీగా విన్నపాలు నమోదయ్యాయి.

పథకాలకు దూరం

గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డును అనుసంధానం చేసింది. ఆరోగ్యశ్రీ, ఆసరా పింఛను, రేషన్ బియ్యం, కరోనా సహాయం, డబుల్ బెడ్రూంఇళ్లు, దళిత, బీసీ, మైనార్టీ బంధు, సంక్షేమ నిధి, సీఎంఆర్ఎఫ్ తదితర పథకాల్లో రేషన్‌కార్డులను పరిగణనలోకి తీసుకుంటున్నారు. దీంతో చాలామంది ఆయా పథకాలకు దూరమయ్యారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కూడా ఆరు గ్యారంటీల పేరిట సంక్షేమ పథకాలను ఆచరణలోకి తెస్తున్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు సైతం అమలవుతున్నాయి. ఈ పథకాలకు కూడా రేషన్‌కార్డులను ప్రామాణికంగా చూస్తున్నారు. త్వరలో చేపట్టనున్న రైతుభరోసా, రైతు రుణమాఫీ అంశాల్లోనూ రేషన్‌కార్డులను పరిశీలించే అవకాశాలున్నాయి. కార్డు లేకున్నా పథకాలు వర్తిస్తాయని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

లక్షకు పైగా అర్హులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షకు పైగానే కొత్త రేషన్ కార్డులు అవసరం ఉన్నట్లుగా గణాంకాలు నిర్ధారిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో 32,750 మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తులు చేశారు. ఇవన్నీ అధికారుల లాగిన్లలో మూలుగుతున్నాయి. మెదక్ జిల్లాలో 15వేల పైచిలుకు దరఖాస్తులు, సంగారెడ్డి జిల్లాలో 22వేల దరఖాస్తులకూ ఏళ్ల తరబడిగా మోక్షం లభించలేదు. మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేయగా కొన్ని దరఖాస్తులు ఆర్ఐ లాగిన్‌లో, మరి కొన్ని తహసీల్దార్ లాగిన్‌లో, ఇంకొన్ని పౌరసరఫరాల అధికారుల అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. దీనికితోడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల్లోనూ ఆరు గ్యారంటీలతోపాటు రేషన్‌కార్డులు ఇవ్వాలని వేలాదిమంది విన్నవించారు.

పదేళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా..

నా వివాహం జరిగి పదేళ్లు కావొస్తుంది. అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డు కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా. ఇద్దరు పిల్లలు కలగడంతో నలుగురి పేర్లతో మరోసారి దరఖాస్తు చేశాను. అయినా ఇప్పటికీ కార్డు రాలేదు. ఆస్పత్రికి వెళితే ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుంటే కార్డు లేదని తిరస్కరించారు.

-మ్యాక సంపత్, మల్లంపల్లి, అక్కన్నపేట

చిగురిస్తున్న ఆశలు

కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలుపెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జనవరిలోనే ఈ ప్రక్రియ మొదవలుతుందనుకున్నా పార్లమెంటు ఎన్నికలు రావడంతో పట్టాలెక్కలేదు. కానీ ఎన్నికల కోడ్ ముగిసి నెల గడిచినా కార్డుల విషయంలో అడుగు ముందుకుపడలేదు. కాగా, ఇటీవల రేషన్‌కార్డుల కోసం మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. కానీ, దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లినవారికి నిరాశ తప్పలేదు. కానీ, తాజాగా ముఖ్యమంత్రే ప్రకటించడంతో ఆశావహుల్లో నమ్మకం నెలకొంది.

మళ్లీ అక్కడే..

- విద్యుత్ పరికరాల స్టోర్ సంగారెడ్డిలోనే..
- ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు
- సిద్దిపేట రూరల్ డివిజన్ నుంచి సంగారెడ్డికి మార్పు

మెదక్, జూలై 12 : మెదక్ జిల్లాకు సంబంధించి విద్యుత్ పరికరాల స్టోర్ తిరిగి సంగారెడ్డి జిల్లాకు బదలాయించారు. ఈమేరకు టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దశాబ్దాలుగా ఉమ్మడి మెదక్ జిల్లా విద్యుత్ పరికరాల స్టోర్ సంగారెడ్డిలోనే కొనసాగుతోంది. మెదక్ జిల్లా పరిధిలోని మండలాల్లో విద్యుత్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కేబుళ్లు, స్టాటర్లు.. ఇలా సమస్త విద్యుత్ పరికరాలను సంగారెడ్డి నుంచి తెప్పించుకునేవారు.

సిద్దిపేటకు తరలింపు

జిల్లాల పునర్విభజన తర్వాత కూడా ఎనిమిదేళ్లుగా స్టోర్ సంగారెడ్డిలోనే కొనసాగింది. కానీ, గత జూన్ 11న మెదక్ జిల్లాను టీజీ ఎస్పీడీసీఎల్ సిద్దిపేట సర్కిల్ పరిధిలో చేర్చుతూ విద్యుత్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది దీంతో స్టోర్స్‌ను సిద్దిపేటకు తరలించారు. సిద్దిపేట సర్కిల్.. రూరల్ జోన్ కావడంతో వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మెదక్ జిల్లాను అక్కడికి బదలాయించారు. కానీ, విద్యుత్ స్టోర్‌ను సిద్దిపేటకు తరలించడంపై స్థానికంగా వ్యతిరేకత వెల్లువెత్తింది. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినా, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయడానికైనా స్తంభాలు, కేబుళ్ల తదితరాల కోసం సిద్దిపేటకు వెళ్లడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని రైతులు, సిబ్బంది వాపోతున్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజాప్రతినిధులు కూడా విద్యుత్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇటీవల జరిగిన మెదక్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విద్యుత్ పరికరాల స్టోర్‌ను సిద్దిపేట నుంచి తిరిగి బదలాయించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట సర్కిల్‌కు తరలించిన మెదక్ జిల్లా విద్యుత్ పరికరాల స్టోర్స్‌ను యథావిధిగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే కొనసాగేలా తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సీఎండీ ముషారఫ్ ఫరుఖ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మెదక్ కేంద్రంగా జిల్లా ఏర్పాటు కావడంతో స్థానిక రైతుల సౌకర్యార్థం విద్యుత్ పరికరాల స్టోర్స్‌ను మెదక్ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో తమకు జరిగిన అన్యాయంపై రాష్ట్రోన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేస్తామని హెచ్చరిస్తున్నారు.



మెదక్ పట్టణంలోని విద్యుత్ శాఖ ఎస్సీ కార్యాలయం

అర్బన్ జోన్ పరిధిలో సంగారెడ్డి సర్కిల్

విద్యుత్‌శాఖకు రాష్ట్రంలోనే అత్యంత అధికంగా రెవెన్యూ వచ్చే సంగారెడ్డి సర్కిల్ అర్బన్ జోన్ పరిధిలో ఉంది. గతంలో ఉమ్మడి జిల్లా రూరల్ జోన్ పరిధిలో కొనసాగడంతో వినియోగదారులకు సేవల్లో అంతరాయం కలిగేది. పటాన్‌చెరు తదితర పారిశ్రామికవాడల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లేది. దీంతో, పరిశ్రమల ఉత్పాదకత పడిపోయింది. దీనిపై తరచుగా విద్యుత్‌శాఖకు ఫిర్యాదులు వచ్చేవి. ఈ సమస్యను గుర్తించిన విద్యుత్ అధికారులు సంగారెడ్డి సర్కిల్‌ను మెడ్చల్ అర్బన్‌జోన్ పరిధిలోకి చేర్చారు. సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాలు అర్బనైజేషన్ జోన్‌లోకి రావడంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు తగ్గిపోయాయని ట్రాన్స్‌కో ఆపరేషన్స్ డీఈ రాంబాబు తెలిపారు.



నామినేటెడ్ రాజకీయం

- గజ్వేల్ కాంగ్రెస్‌లో వర్గాలు
- నర్సారెడ్డి వర్సెస్ అసమ్మతి నాయకులు
- గ్రూపుల గోలతో తగ్గిన వలసలు
- అధిష్ఠానం దృష్టి సారిస్తేనే అసమ్మతికి చెక్!

గజ్వేల్, జూలై 12 : గజ్వేల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు చిచ్చురేపాయి. పదేళ్ల ప్రతిపక్షానికి పరిమితమైన కాంగ్రెస్ పార్టీ.. రేవంత్‌రెడ్డి సారథ్యంలో అధికారంలోకి రావడంతో పలువురు కార్యకర్తలు, నాయకులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. నామినేటెడ్ పదవుల పంపకం వ్యవహారంలో నియోజకవర్గంలో పార్టీ నాయకులు రెండుగా చీలిపోయారు. డీసీసీ అధ్యక్షుడిగా, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నర్సారెడ్డి పలువురికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఖరారు చేసినట్లు ప్రచారం జరగడంతో చిచ్చురేగింది. ఈ పదవులను ఆశిస్తున్న మరికొంత మంది టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావుతో కలసి మంత్రులు, కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలిసి తమ అసమ్మతిని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పూర్తిగా తగ్గిపోయాయి. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైన పలువురు నాయకులు సైతం గ్రూపులను చూసి సైలెంట్ అయిపోయారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేటెడ్ పదవుల విషయం పార్టీని డ్యామేజ్ చేసే అవకాశాలు ఉన్నాయి.

ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న పార్టీ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాకా కావడంతో ఇక్కడ కాంగ్రెస్‌కు అంతగా అనుకూల పరిస్థితి లేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ బలోపేతంపై దృష్టిసారించిన నాయకులు ఆశించిన స్థాయిలో వలసలను ప్రోత్సహించలేకపోయారు. ఎంపీ ఎన్నికల సమయంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ వారి అనుచరులు పార్టీలో చేరారు. మరిన్ని వలసలు ఉంటాయని, భారీ స్థాయిలో ఆయా పార్టీల నాయకులు పార్టీలో చేరుతారన్న ప్రచారం జరిగినప్పటికీ కాంగ్రెస్‌లో చెలరేగిన గ్రూపుల గోలతో ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

నామినేటెడ్ వ్యవహారంతో స్థానికానికి ముప్పు

గజ్వేల్ నియోజకవర్గంలో చెలరేగిన నామినేటెడ్ పదవుల చిచ్చు ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో ఏర్పడిన గ్రూపుల కారణంగా కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఈ గ్రూపుల విషయంలో ఇప్పటికే మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. ఇరు వర్గాలకు చెందిన ముఖ్యులను పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది. అయినా కూడా పూర్తిస్థాయిలో అధిష్ఠానం దృష్టి సారిస్తే తప్ప నియోజకవర్గంలో చెలరేగిన చిచ్చు ఆరేలా కనిపించడం లేదు. ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కార్యకర్తలు బాహటంగానే చర్చించుకుంటున్నారు. పలు గ్రామాల్లో కనీసం పది మంది కార్యకర్తలు లేకుండా పార్టీ ఎలా బలోపేతం అవుతుందని, నియోజకవర్గంలోని నాయకులు ఒక తాటిపైకి వచ్చి పార్టీని బలోపేతం చేస్తేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగా సీట్లు గెలుచుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. లేదంటే పార్టీకి, పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలకు, ఆయా పోస్టులు ఆశిస్తున్న నాయకులకు ఆశాభంగం తప్పదని భావిస్తున్నారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'కు ఆహ్వానం

- అన్ని వర్గాల వారికి అవకాశం
- ఆగస్టు 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు
- 15న జిల్లాస్థాయిలో ప్రదర్శన
- ఉత్తమ ఆవిష్కరణలకు బహుమతుల ప్రదానం

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 12 : వివిధ వర్గాలకు చెందిన వారిలో సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం యేటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఏ వృత్తిలో ఉన్నా కొత్త ఆలోచనలు ఉన్నవారు ఇందులో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. తమ ఆలోచనలకు సృజనాత్మకతను జోడించి పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది దరఖాస్తులను ఆగస్టు 3 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఆగస్టు 15న జిల్లా స్థాయిలో ఆవిష్కరణలను ప్రదర్శిస్తారు. ఉత్తమమైన వాటికి ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులను అందజేస్తుంది.

వివిధ రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్నదాతలు, విద్యావేత్తలు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, గృహిణులు ఇలా ఎవరైనా ఆవిష్కరణలు చేయవచ్చు. తమ ఆలోచనలకు సృజనాత్మకను జోడించి పూర్తి వివరాలతో ప్రయోగాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మన చుట్టుపక్కల ఇళ్లు, విద్యాలయాలు, వ్యవసాయం ఇతర సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఆవిష్కరణలు చేయాలి. ఇప్పటికే ఉన్న వస్తువుల్లో కొన్ని మార్పులు చేసి కొత్త వాటిని కూడా రూపొందించవచ్చు. మీరు రూపొందించే ఆవిష్కరణ అందరి మెప్పు పొందేలా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తుంది.

నూతన ఆవిష్కరణకు 'ఇన్‌స్పైయిర్'

విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ మనుచౌదరి శుక్రవారం ఇన్‌స్పైయిర్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. నూతన ఆవిష్కరణకు ఇన్‌స్పైయిర్ అవార్డు అని, కాంపిటీషన్ పోటీలు ఒక చక్కటి వేదికగా పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను రూపొందించాలని తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. 6వ తరగత నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీడియో, ఫొటోలను పంపాలి..

ఇంటింటా ఇన్నోవేటర్‌లో పాల్గొనడానికి వెబ్‌సైట్‌లో ఆగస్టు 3 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆవిష్కరణల వివరాలను ఆగస్టు 5లోగా నంబరుకు 9100678543 వాట్సాప్ చేయాలి. అందులో ఆవిష్కరణకు సంబంధించి ఆరు వాక్యాల వివరణ ఉండాలి. రెండు నిమిషాల నిడివి వీడియో, 4 ఫొటోలు తీసి పంపాలి. ఆవిష్కర్త పేరు, సెల్ నంబరు, ప్రస్తుత వృత్తి, గ్రామం, పట్టణం, జిల్లా పేరు రాయాలి.


ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ప్రతి ఇంటి నుంచి ఒక ఆవిష్కర్త తయారవ్వాలి

-మనుచౌదరి, కలెక్టర్

నూతన ఆవిష్కరణలకు సిద్దిపేట జిల్లా వేదిక కావాలి. ప్రతి ఇంటి నుంచి ఒక ఆవిష్కర్త తయారవ్వాలి. చదువు వయస్సుతో పనిలేదు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదును పెట్టే గొప్ప అవకాశం.

సద్వినియోగం చేసుకోవాలి

- ఆనంద్, ఈడీఎం

సమాజంలోని సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థులు, గృహిణులు, రైతులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు ఎవరైనా పాల్గొనవచ్చు.

డెంగీ కలకలం

- సిద్దిపేటకు చెందిన బాలుడికి నిర్ధారణ
- అప్రమత్తమైన అధికారులు
- బాధితుడి ఇంటికి వెళ్లి పరిసరాల పరిశీలన
- పట్టణంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం
- జీజీహెచ్‌లో సాయంత్రం కూడా ఓపీ సేవలు


రోగులతో కిటకిటలాడుతున్న సిద్దిపేటలోని జీజీహెచ్ ఆసుపత్రి

సిద్దిపేట టౌన్, జూలై 12 : సిద్దిపేట పట్టణంలో శుక్రవారం డెంగీ కేసు కలకలం సృష్టించింది. పట్టణంలోని భారత్‌నగర్‌కాలనీకి చెందిన విఘ్నేష్‌రెడ్డి (14) మూడు, నాలుగురోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో కుటుంబీకులు మెడికల్ కళాశాల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు డెంగీగా నిర్ధారించారు. పట్టణంలో డెంగీ కేసు నమోదుతో వైద్య, మున్సిపల్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. విషజ్వరాలపై సమీక్షిస్తున్నారు. డెంగీ బారిన పడిన బాలుడి ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. ఇంట్లోని తడి చెత్తను హోం కంపోజ్ చేస్తున్నారని, బీడీలు చేసేందుకు ఉపయోగించే ఆకును ఇంటి ఆవరణలో స్టోర్ చేసినట్లు గుర్తించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ చెత్త అంతా తడిసి ముద్దయింది. దానివల్ల దోమలు విపరీతంగా పెరిగి బాలుడు డెంగీ బారిన పడినట్లు గుర్తించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బంది దోమల మందు పిచికారి చేసి, బ్లీచింగ్‌ను చల్లారు. పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు.

కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

సీజనల్ వ్యాధులు విజృభిస్తుండటంతో జనం ఆసుపత్రుల బాట పడుతున్నారు. సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వస్తున్నారు. సకాలంలో వైద్యసేవలు అందించేందుకు సాయంత్రం కూడా ఓపీ సేవలు కొనసాగిస్తున్నారు. జూన్‌లో జనరల్ మెడిసిన్ నిమిత్తం 5,297 మంది రోగులు రాగా, ఈ నెల ఇప్పటి వరకే 2,355 మంది రోగులు వచ్చారు. చిన్నారులకు చికిత్సనందించేందుకు పిల్లల వైద్యులు కూడా అందుబాటులో ఉంటున్నారు.

డెంగీ లక్షణాలు

ఎడీస్ ఈజిప్ట్ దోమతో డెంగీ వస్తుంది. ప్లేవీ స్లూక్ష జీవి ద్వారా ఇది వ్యాప్తిచెందుతుంది. ఎడీస్ దోమలు ఉదయంపూట ఎక్కువగా కుడతాయి. చికున్‌గున్యా కంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరిస్తుంది. డెంగీకి ప్రత్యేకమైన చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. ఈ వ్యాధికి గురైన వారికి తీవ్రమైన తలనొప్పి, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, కండరాలు, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, నొప్పితో కూడిన కంటి కదలికలు, వాంతులు, విరోచనాలు అవుతాయి.

వైద్యులను సంప్రదించాలి



తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు, విరేచనాలు వంటి తదితరమైన ఇబ్బందులతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మెరుగైన చికిత్స అందిస్తే త్వరగా కోలుకోవచ్చు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటితొట్లపై దోమలు చేరకుండా మూతలు బిగించుకోవాలి. దోమలు గుడ్లు పెట్టేందుకు ఏ మాత్రం ఆస్కారం లేకుండా పాత టైర్లు, కొబ్బరిబొండాలు, కుండీల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి.

- డాక్టర్ కిషోర్ కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్ సిద్దిపేట

ప్రభుత్వ లక్ష్యంపై గొడ్డలి వేటు

ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే పథకాలు అధికారుల అవగాహనలోపం వల్ల నీరుగారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అధికారులు తమ టార్గెట్‌ను పూర్తిచేసేందుకు రోడ్డుకు సమీపంలో, కరెంటు తీగల కింద హరితహారం మొక్కలు నాటి చేతులుదులుపుకున్నారు. ఇప్పుడు మొక్కలు ఏపుగా పెరగడంతో తీగలకు తగలడం వల్ల విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో చెట్లపై గొడ్డలి వేటు తప్పడం లేదు. ప్రస్తుతం అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరితో పాటు పలు గ్రామాల్లో కరెంటు తీగల కింద చెట్లకొమ్మను నరికేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రజాధనం వృథా అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మొక్కలు నాటే సమయంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొని నాటితే వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

- అక్కన్నపేట, జూలై 12



అనుమానాస్పద స్థితిలో బీహార్ యువకుడి మృతి

కోహీర్, జూలై 12 : అనుమానాస్పద స్థితిలో బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారు నవ్య వెంచర్‌లో శుక్రవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రామ శివారులో నవ్య డెవలపర్స్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్‌రాయ్(22), అప్పుకుమార్, మోహన్‌మాతో, కమలేశ్ ఇక్కడ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ముగ్గురు విధులు నిర్వహిస్తున్న క్రమంలో గుర్తుతెలియని దుండగులు వెంచర్‌లోకి ప్రవేశించి ట్రాక్టర్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకోబోయిన కుందన్‌రాయ్‌ని ట్రాక్టర్‌తో ఢీ కొట్టి, అతడిపై దాడి చేసి హత్య చేసి ఉండవచ్చని గ్రామస్థులతో పాటు పలువురు అనుమానం వ్యక్తంచేశారు. కానీ పోలీసుల కథనం మరో ఉంది. జహీరాబాద్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురు మద్యం సేవించి వెంచర్‌లో ఉన్న ట్రాక్టర్‌ను నేర్చుకునే క్రమంలో ట్రాక్టర్ వెనుక నీటి ట్యాంకర్ పడిపోయింది. ఆ క్రమంలో కుందన్‌రాయ్ ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని సీఐ వివరించారు. అయితే ఈ సంఘటనలో ట్రాక్టర్ ఇంజన్‌కు అనుసంధానంగా ఉన్న నీటి ట్యాంక్ మాత్రమే బోల్తా పడి ఒక ప్రాంతంలో ఉండగా కుందన్‌రాయ్ బాడీ మాత్రం మరో ప్రాంతంలో ఉంది. మృతదేహాన్ని జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి పరిశీలించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగించేలా పనిచేయాలి

● సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులతో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో ఇటీవల బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన 19 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించడం, ఇటీవల విడుదల చేసిన బాసర ట్రిపుల్‌ఐటీలో 19 మంది విద్యార్థులు సీట్లను పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతీ ఏటా ఉన్నతమైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన బీఆర్ ఫౌండేషన్ వారు పాఠశాలకు ఐదు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ బహూకరించగా ఫౌండేషన్ ప్రతినిధి కొర్తివాడ కిషన్‌ని డీఈవో అభినందించి సన్మానం చేశారు. అనంతరం డీఈవోను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, జూలై 12: బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను శుక్రవారం బీఆర్‌ఎస్వీ నాయకులు సన్మానించారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి, చింతమడక ప్రభుత్వ బడుల్లో, ఇర్కోడు ఆదర్శ పాఠశాల నుంచి ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పడిగే ప్రశాంత్ అభినందించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలోని 16 మంది విద్యార్థులను బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు గుజ్జ రాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుంటయ్య తదితరులు సన్మానించారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన సంగారెడ్డి డీఈవో

సంగారెడ్డి అర్బన్, జూలై 12: విద్యార్థులను చితకబాదిన ఓ ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంది ప్రాథమిక పాఠశాల(ఎంపీజీపీఎస్)లో పనిచేస్తున్న తస్వీర్ ఫాతిమా రెండు రోజుల క్రితం అదే పాఠశాలలో చదివే విద్యార్థినులను అకారణంగా వాతలు వచ్చేలా కొట్టిందని తల్లిదండ్రులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలలో గుట్కా తింటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనంలో దుమ్మూధూళి పడినా.. అలాగే విద్యార్థులకు వడ్డిస్తుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎంఈవో వెంకటనర్సింలు విచారణ జరిపి, సదరు ఉపాధ్యాయురాలు తస్వీర్ ఫాతిమాను సస్పెండ్ చేశారు.

పగలు వ్యవసాయ పనులు.. రాత్రి దొంగతనాలు

● అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

● 43 తులాల బంగారం, 5 కిలోల వెండి స్వాధీనం



నిందితులను, స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులను చూపుతున్న సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి క్రైం, జూలై 12 : పగలు వ్యవసాయ పనులు చేస్తూ.. రాత్రి సమయాల్లో తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నారాయణఖేడ్ డివిజన్ సిర్గాపూర్ మండలం బాబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ జైరాం(38) ముఠాలో ఎనిమిది మంది ఉండగా ఐదుగురు నిందితులు ప్రస్తుతం జైలులో ఉన్నారు. జన జీవనంలో ఉన్న ముగ్గురు జాదవ్ శంకర్ అలియాస్ శంకు(38), ఇప్పుసింగ్ రాథోడ్ అలియాస్ ఇప్పు(37) వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తుంటారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని పలు గ్రామాలకు చేరుకుని పగలు దొరికిన వ్యవసాయ పనులను చేస్తుండేవారు. రాత్రుళ్లు గ్రామ శివారు ప్రాంతాల్లో తాళం వేసి ఇళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో జూన్ 2న అందోల్ మండలం ఎర్రారంలో 8 ఇళ్లల్లో, జూన్ 8న మాసాన్‌పల్లిలో 4 ఇళ్లల్లో, జూన్ 14న చౌటకూర్‌లో 5 ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో దొరికిన ఆధారాలతో శుక్రవారం ఉదయం 6 గంటలకు సిర్గాపూర్ మండలం బిబియా నాయక్ తండాలో నిందితులను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 43 తులాల బంగారం, 5 కిలోల వెండి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ దాదాపు రూ.36 లక్షలు ఉంటుందని అదనపు ఎస్పీ వివరించారు. ఐదేళ్లలో వీరంతా దాదాపు 108 ఇళ్లల్లో దొంగతనాలు చేశారు. ఆరు నెలల్లోనే 41 ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ ఎ.సత్తయ్యగౌడ్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అంతర్‌జిల్లా దొంగల ముఠాను పట్టుకున్న పోలీసు అధికారులను ఎస్పీ రూపేష్ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

సంగారెడ్డి కెనాల్‌కు భూములు ఇచ్చేది లేదంటూ రైతుల రిలే నిరాహారదీక్ష

● సంఘీభావం తెలిపిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



రైతుల రిలే దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జూలై 12: సంగారెడ్డి కెనాల్ కోసం భూములు తీసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తుండగా, భూములను ఇచ్చి రోడ్డు పాలు కాలేమంటూ రైతులు రిలే నిరాహార దీక్షకు దిగారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద మండలంలోని చిన్నచింతకుంట, గొల్లపల్లి, బ్రాహ్మణపల్లి, శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల, సికింద్లాపూర్, చెన్నాపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉన్న తమ ప్రాంత భూముల విలువ ఎకరాకు రూ.కోటి వరకు పలుకుతుందని పైగా త్వరలో ఈ ప్రాంతం నుంచే రీజినల్ రింగురోడ్డు కూడా వెళ్తున్నందున మరింత డిమాండ్ రానుందని తెలిపారు. ఈ తరుణంలో తమ భూములను సంగారెడ్డి కెనాల్ కోసం తీసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకుంటుండటంతో తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. తమ జీవనధారమే ఈ భూములని వాటిని ఇచ్చి తామెలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కావాలంటే ఎకరాకు రూ.60 లక్షలకుపైగా చెల్లించాలని లేదంటే భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు సరైన హామీ ఇచ్చే వరకు రిలేదీక్ష కొనసాగుతుందన్నారు. వీరికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్, జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో భూసేకరణకు అధికారులు వచ్చినప్పుడు తమ రాజకీయ ప్రయోజనాల కోసం నానా హంగామా చేసిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిమోద్దీన్, మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాక, జూలై 12 : అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యంను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, దుబ్బాక పోలీసులు కలిసి శుక్రవారం పట్టుకున్నారు. మిరుదొడ్డి మండలం మోతే గ్రామానికి చెందిన మోతే శ్రీనివాస్, ప్రశాంత్, చింతల రవి, విబూదీ సలీమ్, విబూదీ సాయిలు కలిసి మూడు ఆటోల్లో రేషన్‌బియ్యం తీసుకుని వెళ్తుండగా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఎర్రవెల్లిలో హిమాన్షు పుట్టినరోజు వేడుక



హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు మనవడు, మాజీ మంత్రి కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు పుట్టినరోజు వేడుకను శుక్రవారం నిర్వహించారు. 19 కిలోల భారీ కేక్‌ను కట్ చేసిన హిమాన్షు.. తాత కేసీఆర్, నాయనమ్మ శోభమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు.

మమ్మల్ని వదిలి వెళ్లకండి సార్!

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల వద్ద విద్యార్థుల కన్నీరు

హత్నూర, జూలై 12: హత్నూర మండల పరిధిలోని సాదుల్లానగర్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పట్టుకుని విద్యార్థులు బోరుమన్నారు. 'మా పాఠశాల నుంచి వెళ్లొద్దు సార్' అంటూ ఉపాధ్యాయులను పట్టుకుని వేడుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవని, తమ స్థానంలో ఇక్కడికి వచ్చే ఉపాధ్యాయులు కూడా కలుపుగోలుగా ఉంటూ మంచి భోజనం అందిస్తారని విద్యార్థులకు సర్ది చెప్పారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు లోకనాథం, రవీందర్‌లను స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్వేత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రే కృష్ణ, యువజన నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఎడ్లబండిపై ఉపాధ్యాయుల ఊరేగింపు

బదిలీపై వెళ్తున్న టీచర్లను గౌరవించిన గ్రామస్థులు, విద్యార్థులు

జోగిపేట, జూలై 12 : తమ పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, పాఠశాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులంతా సముచితంగా గౌరవించారు. శుక్రవారం జోగిపేటలోని పాఠశాల ఆవరణలో సన్మానసభను ఏర్పాటు చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు రజనీకాంత్, పద్మ, రవికుమార్, ఆత్మబాంధవ్, సూర్యారావు, శాబాది రాములును ఘనంగా సన్మానించారు. అనంతరం వారిని ఎడ్లబండిపై గ్రామంలో ఊరేగించి, తమ ఆత్మీయతను చాటుకున్నారు. బదిలీపై నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను కూడా సన్మానించి పాఠశాలలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మాణిక్యంగౌడ్, లింగాగౌడ్, అశోక్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగభూషణం, నాయకులు రాజాగౌడ్, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లబండిపై ఉపాధ్యాయులు

హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ కోర్సుపై నీలినీడలు



కవేలి చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

● భవనం అప్పజెప్పక.. తరగతులకు దూరం

● ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అడ్మిషన్ ఇవ్వడం లేదు

కోహీర్, జూలై 12 : హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైనా అడ్మిషన్ దొరకడం లేదు. పేరుకే కళాశాల భవనం ఉండగా తరగతులు మాత్రం నిర్వహించడం లేదు. భవనాన్ని అప్పగించకపోవడంతో కోహీర్ మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సు కొనసాగేలా లేదు.

మూతపడిన కళాశాల

పేద విద్యార్థులకు వృత్తి విద్య కోర్సు అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2012 సంవత్సరంలో అప్పటి మంత్రి జె.గీతారెడ్డి కృషితో రూ.12.3 కోట్లు వెచ్చించి కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తా వద్ద రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కళాశాల నిర్మాణం పూర్తయ్యేంత వరకు తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కళాశాల భవనం నిర్మాణం ఆలస్యమైనప్పటికీ ఎట్టకేలకు 2017లో పూర్తయింది. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కళాశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయస్థాయిలో పోటీ పరీక్షలను నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసి పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఈ కళాశాలలో డిగ్రీ తరగతులను నిర్వహించారు. మూడేళ్ల పాటు కళాశాల ఆటంకం లేకుండా కొనసాగగా కరోనాతో తలకిందులైంది. మహమ్మారి అనంతరం ప్రవేశాలు జరగడం లేదు. దీంతో హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిరుపయోగంగా మారింది.

ఎంజేపీ మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఏర్పాటు

విద్యార్థులు లేక భవనం వృథాగా ఉండడంతో గతేడాది ఇక్కడ మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను ఏర్పాటు చేసి, నిరుపేద విద్యార్థినులకు వృత్తి విద్య కోర్సు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి జిల్లా స్థాయిలో దరఖాస్తులను స్వీకరించారు. మొదట్లో 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది అక్టోబర్‌లో అప్పటి మంత్రి హరీశ్‌రావు కవేలి చౌరస్తాలోని ఎంజేపీ మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను ప్రారంభించారు. సరైన సౌకర్యాలు లేక వివిధ కారణాలతో మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించలేకపోయారు.

ఎంజేపీ సొసైటీకి అప్పజెప్పకపోవడంతో

రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ పరిధిలో ఉన్న భవనాన్ని ఎంజేపీ విద్యాలయానికి అప్పజెప్పకపోవడంతో ఇంటర్మీడియట్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివిన విద్యార్థినులు డిగ్రీ ప్రవేశాలను పొందలేక ఆందోళనలో ఉన్నారు.

సంవత్సరం వృథా అయింది



కవేలి చౌరస్తాలోని మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ హోటల్ మేనేజ్మెంట్ కళాశాలను ప్రారంభించకపోవడంతో సంవత్సరం వృథా అయింది. డిగ్రీ కోర్సులో ప్రవేశం పొందేందుకు అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ అడ్మిషన్ ఇవ్వడం లేదు. కళాశాలను ప్రారంభించ లేదు. ఈ సంవత్సరమైనా కళాశాలను ప్రారంభించి తరగతులు ప్రారంభిస్తే వృత్తి విద్య కోర్సు నేర్చుకునే అవకాశం ఉంది.

- నీరజ, హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థిని

ప్రస్తుత సంవత్సరం ఇక్కడ తరగతులు నిర్వహించేందుకు రెండు నెలలు క్రితం ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు ఇప్పటివరకు అడ్మిషన్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రధాన కారణం హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనాన్ని మహాత్మ జ్యోతిబాపూలే సొసైటీకి అప్పజెప్పకపోవడమే. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిగ్రీ కోర్సులో ప్రవేశం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నేటి నుంచి ఆషాడి ఉత్సవాలు

మర్కూక్ పాండురంగ ఆశ్రమంలో ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన ఆలయం

మర్కూక్, జూలై 12 : పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో తెలంగాణ పండరీపురంగా ప్రసిద్ధిగాంచిన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని పాండురంగ ఆశ్రమం ఆషాడి ఉత్సవాలకు సిద్ధమైంది. ప్రతీ ఏటా ఆషాఢ శుద్ధ ఏకాదశి, ద్వాదశితో పాటు వరుసగా మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలను అత్యంత వైభవంగా కనులపండుగగా నిర్వహిస్తారు. దశమి రోజు అశేష భక్తజనం సమక్షంలో అఖండ హరినామ స్మరణ ప్రారంభించి ద్వాదశి వరకు మూడు రోజుల పాటు కొనసాగిస్తారు. ఏకాదశి రోజు భక్తులంతా ఉపవాసం ఉండి జాగారం చేస్తారు. శనివారం నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, ధార్మిక ప్రసంగాలు, సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులను ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

మహా అన్నదానం

భవానందస్వామి స్వహస్తాల చేత 1992లో ఆషాడి ఉత్సవాల్లో మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు ముందు రోజున సాయంత్రం వివిధ రకాలైన వంటకాలను వండి అన్నాన్ని పెద్దరాలిగా ఆరబోసి అన్నపూజ నిర్వహిస్తారు. అనంతరం దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పాండురంగాశ్రమం సంప్రదాయం ప్రకారం చాటల ద్వారా భక్తులకు అన్నం వడ్డిస్తారు. మొదటి రోజు శ్రీశ్రీశ్రీ యతివర భావానందస్వామి వారికి పాదుకాపూజతో విశేష పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మంగళవారం నుంచి 93వ ఆషాడి త్రిరాత్రోత్సవం ప్రారంభమవుతుంది. చివరి రోజైన గురువారం ద్వాదశి అన్నపూజ, భక్తులకు అఖండ మహా అన్నప్రసాద వితరణ జరుగుతుంది.

'మహిళా శక్తి'ని సమర్థవంతంగా అమలు చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 12: మహిళా శక్తి పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సెర్ప్, స్త్రీనిధి సిబ్బందితో పాటు ఏపీఎంలు, సీసీలు, జిల్లా మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరింత చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం తెలంగాణ మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీని కింద గ్రామ సమాఖ్యలో సంఘాలకు రూ.కోటి రుణాలను అందజేయడంతోపాటు ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేసి వారిని కోటీశ్వరులను చేయడమే మహిళ శక్తి పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి, సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశాలన్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళా శక్తి పథకంలో భాగమన్నారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి 11,618 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.106.93 కోట్ల పంపిణీకి కార్యాచరణ రూపొందించామన్నారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మనెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడిగేదెల పెంపకం, పాల డైయిరీల ప్రోత్సాహం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్మెంట్ తదితర 14 రకాల జీవనోపాధిలను కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిర, అడిషినల్ డీఆర్వో సరస్వతి, డీఈవో రాధాకిషన్, మత్స్యశాఖ అధికారి నరసింహారావు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణమూర్తి, పశుసంవర్ధక శాఖ అధికారి విజయశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

● ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఆకస్మిక తనిఖీలు



రెజ్లింగ్ శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు రూరల్, జూలై 12 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని గురుకుల విద్యాలయ సిబ్బందిని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి వల్లూరు ఆదేశించారు. ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, భోజనశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంటగది, స్టోర్‌రూమ్, భోజనశాలలో పరిశుభ్రత పాటించాలని, పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించాలన్నారు. విద్యతో పాటు పిల్లలంతా క్రీడలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రెజ్లింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు పాఠశాల విద్యార్థులు ఇప్పటివరకు 11 సార్లు రెజ్లింగ్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌ను, రెండుసార్లు నేషనల్ మెడల్స్ పొందినట్లు పాఠశాల రెజ్లింగ్ కోచ్ ప్రియాంక కలెక్టర్‌కు తెలిపారు. పాఠశాలలో అండర్ 14 నుంచి అండర్ 17 విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి దేవుజా, తహసీల్దార్ రంగారావు, కళాశాల ఆర్సీవో భీమయ్య, ప్రిన్సిపాల్ యోగేందర్ లక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేయాలి

పటాన్‌చెరు : మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామంలో పంచాయతీ కార్యాలయం, పాఠశాలను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. వనమహోత్స ఏర్పాట్లను సమీక్షించారు. ఆయా శాఖలకు కేటాయించిన వనమహోత్సవ లక్ష్యాలకు అనుగుణంగా వందశాతం పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అవకాశాలున్నా.. అవగాహన లేక..!

ఐటీఐ విద్యపై ఆసక్తి చూపని విద్యార్థులు

● ఏటీసీ ప్రారంభంతోనైనా మెరుగుపడేనా?



కుకునూరుపల్లిలోని ఐటీఐ కళాశాల

కుకునూరుపల్లి, జూలై 12 : ఉపాధి అవకాశాలకు దారిచూపేది పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కోర్సులు. పరిశ్రమలు, ఉత్పాదక, తయారీ కేంద్రాల్లో ఐటీఐ పూర్తి చేసిన వారికి భారీ డిమాండ్ ఉంది. రైల్వేలు, కేంద్ర స్థాయి సంస్థలు, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో పెద్దమొత్తంలో వీరి సేవలు అనివార్యం. పలు టెక్నికల్ పోస్టులను ఎక్కువగా సంబంధిత ట్రేడు(కోర్సు)ల్లో ఐటీఐ చదువుకున్నవారితోనే భర్తీ చేస్తారు. ఒకరి కింద జీతంతో పనిచేయాల్సిన అవసరం లేకుండా ఐటీఐలోని పలు ట్రేడుల్లో విద్యను అభ్యసించి అనుభవం సంపాదించిన అనంతరం స్వయం ఉపాధి వైపు అడుగులు వేయొచ్చు. నైపుణ్యం ఉన్న ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్‌లుగా స్థిరపడేందుకు అవకాశాలున్నాయి. పదో తరగతి అర్హతతోనే తక్కువ వ్యవధిలో ఉపాధి దారులు ఎన్నో కల్పిస్తున్న ఐటీఐ విద్య పట్ల విద్యార్థులకు అవగాహన కరువైంది. డిమాండ్ ఉన్నప్పటికీ ఐటీఐ ఉపయోగాలు, లాభాల గురించి తెలియకపోవడంతో విద్యార్థులు ఎవరు ఇందులో చేరేందుకు ఆసక్తి కనబరచడం లేదు.

ట్రేడుల్లో భారీగా మిగులుతున్న సీట్లు

సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో 27 ఏళ్ల క్రితం ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఐటీఐ విద్యను అభ్యసించేందుకు ఎక్కువగా విద్యార్థులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఎలాంటి ఎంట్రెన్ టెస్టు లేకుండానే పదవ తరగతి అర్హతతో దరఖాస్తు చేసుకున్న వారు వివిధ ట్రేడుల్లో అడ్మిషన్ పొందవచ్చు. కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, రెండు మెకానిక్, డీజిల్, వెల్డర్ కోఫా ట్రేడుల్లో ఆన్‌లైన్ విధానం ద్వారా అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయి. రెండు దశలుగా ప్రవేశాలను నిర్వహిస్తున్నారు. మొదటి దశ మే 16 నుంచి జూన్ 10తో ముగియగా రెండవ దశ ప్రవేశాలు జూలై 4 నుంచి 15 వరకు కొనసాగుతున్నాయి. మొదటి దశలో అతితక్కువగా అడ్మిషన్‌లు వచ్చాయి. ఇక రెండో దశ అడ్మిషన్ ప్రక్రియ ముగుస్తున్నప్పటికీ విద్యార్థులు ఎవరు అంతగా ఆసక్తి చూపడంలేదు. దీంతో కళాశాలలోని పలు ట్రేడుల్లో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయి.

ఏటీసీ పనులు ప్రారంభం

ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా ఐటీఐలను 'అధునాతన సాంకేతిక కేంద్రాలు'(ఏటీసీ)గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. టాటా సంస్థ సహకారంతో అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కుకునూరుపల్లి ఐటీఐ కళశాలలో ఏటీసీ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సెంటర్ నిర్మాణం పూర్తి అయితే రోబోలతో ఎలా పని చేయించాలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఏటీసీ పూర్తి చేసిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు లభించనున్నాయి. ఎలాంటి డబ్బు చెల్లించకుండా ఏటీసీలో ప్రవేశం పొందవచ్చు. అయితే, ఏటీసీ అప్‌గ్రేడేషన్ నిర్ణయంతోనైనా ఐటీఐలో ప్రవేశాలు మెరుగుపడుతాయో చూడాలి.

ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడాలని చేరాను



భవిష్యత్తులో ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడాలనే ఉద్దేశంతోనే ఐటీఐలో చేరాను. ఒకరి వద్ద పనిచేయాల్సిన అవసరం లేకుండా స్వయంగా ఎలక్ట్రీషియన్‌గా వృత్తి కొనసాగిస్తూ భవిష్యత్తులో స్థిరపడాలనేది నా కోరిక.

- రాజు, ఎలక్ట్రీషియన్ విద్యార్థి

అవగాహన లేకే చేరని విద్యార్థులు

ప్రస్తుత కాలంలో ఐటీఐపై విద్యార్థులకు అవగాహన లేకపోవడంతో ఇందులో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. కళాశాలలో చదివిన విద్యార్థులు పలు ఫార్మా పరిశ్రమలలో, ఎయిర్‌పోర్ట్‌లలో పనిచేస్తూ భారీ వేతనాన్ని అందుకుంటున్నారు. చాలా మంది విద్యార్థులు స్వయం ఉపాధి ద్వారా స్థిరపడ్డారు. అంతేకాకుండా కళాశాలలో నూతనంగా అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ పనులు ప్రారంభమయ్యాయి. భవిష్యత్తులో ఈ కోర్సుకు మంచి అవకాశాలు ఉంటాయి. ఐటీఐలో చేరి విద్యార్థులు బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలి.

- వెంకటరమణ, కుకునూరుపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

'గృహజ్యోతి' సవరణలకు అవకాశం

● ఎంపీడీవో శ్రీరాములు



నారాయణరావుపేట: గృహజ్యోతి దరఖాస్తుల సవరణ చేయించుకుంటున్న ప్రజలు

సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట/కుకునూరుపల్లి, జూలై 12: ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో అర్హులై ఉండి గృహజ్యోతి పథకం అందనివారు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవాకేంద్రంలో సవరణ చేసుకోవాలని నారాయణరావుపేట ఎంపీడీవో శ్రీరాములు సూచించారు. గృహజ్యోతి పథకం దరఖాస్తు వివరాల సవరణను శుక్రవారం పునఃప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. జీరో బిల్లు రాని వారికి ప్రభుత్వం సవరణ చేసేందుకు మరో అవకాశం కల్పించిందన్నారు. గృహజ్యోతి సైట్ పనిచేయని సమయంలో స్వీకరించిన దరఖాస్తులను కూడా ఆన్ లైన్‌లో సవరిస్తామని తెలిపారు.

గృహజ్యోతి పథకానికి మరోమారు దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని కుకునూరుపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు మరోమారు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, దరఖాస్తు చేసుకోవడానికి ప్రజాపాలన రసీదు, కరెంట్‌బిల్లు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను కొండపాకలోని ఎంపీడీవో ప్రజాపాలన కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

శిథిలావస్థలో 'సంక్షేమం'

● మరుగుదొడ్లలో నీరు రాదు

● శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు

● వర్షం కురిస్తే శ్లాబ్ నుంచి నీరు లీక్

కోహెడ, జూలై 12: పేద విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు వసతిసౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణలోపంతో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. కోహెడ మండలంలోని శనిగరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, బీసీ వసతి గృహాల్లో ఏళ్ల తరబడి సమస్యలు తిష్ఠ వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన సొంత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలోనే వసతి గృహాలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వీటిల్లో సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు.

మరుగుదొడ్లతో అవస్థలు

ఎస్సీ బాలుర వసతి గృహంలో ఒకప్పుడు 100 మందికి పైగా విద్యార్థుల ఉండేవారు. కానీ నేడు 45 మంది విద్యార్థులే ఉన్నారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తొమ్మిది మరుగుదొడ్లు ఉన్నప్పటికీ ఐదు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో కూడా టైల్స్ పగిలిపోయే అధ్వానంగా తయారయ్యాయి. అలాగే బీసీ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కూడా కనుమరుగైయ్యాయి. మరుగుదొడ్లకు తలుపులు లేవు. మూత్రశాలల్లోని టైల్స్ పగిలిపోయి నీటి సరఫరా కూడా ఆగిపోయింది.

అన్నీ సమస్యల్యే..

శిథిల భవనాలు, వర్షం వస్తే కురిసే గదులు, తలుపులు లేని మరుగుదొడ్లు, నీటి సరఫరా లేని స్నానాల గదులు, పైపులైన్, సెప్టిక్ ట్యాంక్, ఇలా చెప్పుకుంటూ పోతే సవాలక్ష సమస్యలు హాస్టళ్లలో తిష్ఠ వేశాయి. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ వసతి గృహాల సమస్యలను పట్టించుకునేవారే కనిపించడం లేదు.



శనిగరం వసతి గృహంలో పెచ్చులూడిన శ్లాబ్



ఎస్సీ బాలుర వసతి గృహంలో చిరిగిన పరుపు

అదనపు కలెక్టర్ హామీ ఇచ్చినా..

చాలా కాలం నుంచి స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం పడితే శ్లాబ్ నుంచి నీరు కారుతున్నది. విద్యార్థులకు ఎప్పుడో ఇచ్చిన పరుపులు చినిగిపోయాయి. ఈ గ్రామంలో ఎస్సీ బాలికల హాస్టల్ ఉండేది. ఆరు సంవత్సరాల క్రితం ఈ హాస్టల్‌ను మూసేశారు. దీంతో ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. మూడు నెలల క్రితం అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి హాస్టల్‌ను సందర్శించారు. సమస్యలు పరిష్కరిస్తామని, మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అయినా అవి నేటికి అమలు కాలేదు. నిద్రపోవడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో కొత్తగా హాస్టల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆశలు

హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హాస్టల్‌లో ఉండే విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డెన్లు ఆశలు పెట్టుకున్నారు. ఈ వసతిగృహాలను సందర్శించాలని, భవనాల పరిస్థితిని పరిశీలించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఎస్సీ బాలుర వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

ఎన్నికల్లో పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గజ్వేల్, జూలై 12: గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్నికల కోడ్ సమయంలో పట్టుబడిన మద్యాన్ని సిద్దిపేట జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురిపి జగన్నాథ్ గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డితో కలసి 37కాటన్ బీర్లు, క్వార్టర్ బాటిళ్లను శుక్రవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఈఎస్ జగన్నాథ్ మాట్లాడుతూ.. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎంపీ ఎన్నికల సందర్భంగా పట్టుకున్న 24 కేసుల మద్యాన్ని ధ్వంసం చేయాలని కోర్టు నుంచి ఆదేశాలు రావడంతో ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. వారితో పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

'డీఎస్సీని వాయిదా వేయాలి'

హుస్నాబాద్ టౌన్, జూలై 12: డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో గిరిజన సంఘాల నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జాబ్ క్యాలెండర్ ప్రకటించి లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. ఉద్యోగాలను పెంచి డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు సత్యం నాయక్, క్రిష్ణానాయక్, భూక్య తిరుపతి నాయక్, శ్రీనివాస్ నాయక్, లక్‌పతినాయక్ తదితరులున్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

● యువజన కాంగ్రెస్ జోనల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నీలేష్ మొహాడ్



గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న నీలేష్

గజ్వేల్, జూలై 12: యువత రాజకీయాల్లోకి రావాలని యువజన కాంగ్రెస్ జోనల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నీలేష్ మొహాడ్ పిలుపునిచ్చారు. త్వరలో యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలేష్ మొహాడ్ మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కడపల్ల కృష్ణారెడ్డి, నాయకులు సమీర్, తదితరులున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ కలెక్టరేట్ ముట్టడి

సిద్దిపేట అర్బన్, జూలై 12: 6 ఏళ్లుగా బకాయి ఉన్న రూ. 8,243 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం సిద్దిపేటలో చలో కలెక్టరేట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. కలెక్టరేట్ దర్నాకి విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చారని, రాష్ట్రంలో ప్రజాపాలన చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తుంటే పోలీసులతో అణిచివేయించాలని చూస్తున్నారని విమర్శించారు. ముట్టడి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్‌కుమార్, నాచారం శేఖర్, సహాయ కార్యదర్శులు చేప్యాల సంతోష్, గుండే అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు అఖి, భారత్, ప్రవీణ్, రాహుల్, సంతోష్ పాల్గొన్నారు.



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కబ్జా చేసిన భూములను ప్రభుత్వానికి అప్పగించాలి

● చేర్యాలలో వివిధ పార్టీల నిరసన

చేర్యాల, జూలై 12: అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేర్యాల మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కబ్జాచేసిన భూదాన్, అసైన్డ్‌భూములను ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం చేర్యాలలో సీపీఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ, టీడీపీ, టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు అంగడిబజారు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చట్టాలను తుంగలో తొక్కి అధికార, ధనబలంతో చేర్యాల పట్టణంతో పాటు ముస్త్యాల, మద్దూరు మండలం లద్నూరు, బంజర తదితర గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, మిగులు భూములను పేదల నుంచి లాక్కుని అక్రమ రిజిస్ట్రేషన్లతో కబ్జా చేశాడని ఆరోపించారు. కొమ్మూరిని జనగామ డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, అక్రమంగా లాక్కున్న భూములను పేదలకు అందించి నిజాయితీ చాటుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు అందె బీరయ్య, భూమిగారి రాజేందర్, ఒగ్గు రాజు, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, భూమిగారి నర్సింహులు, గుండ్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కంటైనర్ బోల్తా

రాయపోల్, జూలై 12: గజ్వేల్ - చేగుంట రహదారిపై మండలంలోని గుర్రాల సోఫా వద్ద శుక్రవారం సాయంత్రం ఓ కంటైనర్ బోల్తా పడింది. గుజరాత్‌కు చెందిన కంటైనర్ గజ్వేల్ నుంచి చేగుంట వైపు వెళ్తుండగా గుర్రాల సోఫా వద్ద అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

దుర్గమ్మ ఆలయంలో కుంకుమార్చన

చేర్యాల, జూలై 12: చేర్యాల పట్టణ శివారులోని దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న వారాహీమాత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరీగా అలంకరించి విశేష పూజలు చేశారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

జగదేవ్‌పూర్, జూలై 12: మండలంలోని దౌలాపూర్‌లో ఉన్న దుర్గమ్మ ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి అమ్మవారి హుండీలోని నగదును దొంగలించారు. నెల రోజుల క్రితం కూడా ఆలయంలో అమ్మవారి ముక్కుపుడక వెండి ఆభరణాలు చోరీ చేశారు. నెల రోజుల్లో రెండుసార్లు ఆలయంలో దొంగతనం జరగడం పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈనెల 16న వేలంపాట

చేర్యాల, జూలై 12: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టనున్న చెరువు పార్కింగ్, సులబ్ కాంప్లెక్స్, వారాంతపుసంతకు సంబంధించి ఈనెల 16వతేదీన వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి లోకేశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరువు పార్కింగ్ కోసం రూ.50వేలు, సులబ్ కాంప్లెక్స్ లీజు కోసం రూ.30వేలు, సంతకు రూ.25వేలు చొప్పున డిపాజిట్ చెల్లించాలని, వేలం పాటల్లో పాల్గొనదలచినవారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయి ఉండరాదని పేర్కొన్నారు.

'గోదావరి జలాలతో చెరువులు నింపాలి'

చేర్యాల, జూలై 12: కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి చెరువులకు నీళ్లు మళ్లించాలని కోరుతూ కొమురవెల్లి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి తదితరులు హైదరాబాదులో ఆయనను కలిసి స్థానిక పరిస్థితులను విన్నవించారు. వర్షాలు లేక రైతులు ఇబ్బందులుపడుతున్నారని, సాగునీటికోసం రిజర్వాయర్‌కు నీటివిడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. స్పందించిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దేవాదుల అధికారులతో ఫోన్‌లో మాట్లా డి రిజర్వాయర్‌కు నీటి విడుదల చేపట్టాలని కోరారు. వారివెంట కాయిత శ్రీనాథ్‌రెడ్డి, ఏర్పుల కష్ణ, దండ్యాల నారాయణరెడ్డి, రాజలింగం, కర్రోల్ల రాజు, కనకరాజు, అక్కెం మల్లయ్య ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కొండపాక, జూలై 12: మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం కొండపాకలో అధికారులు మండలస్థాయి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధిహామీ లోని ప్రతీ పనిని అధికారులు పూర్తిగా సమీక్ష చేసి రికార్డులను పరిశీలించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేశారు. ఈ తనిఖీలో డీఆర్డీఏ అదనపు పీడీ బాలకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఉపాధిహామీ తనిఖీ అధికారులు ప్రభాకర్, ఈజీఎస్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాల సామగ్రి పెట్టవద్దు

● గజ్వేల్ సీఐ బి.సైదా, ట్రాఫిక్ సీఐ మురళీ

గజ్వేల్, జూలై 12: రోడ్డుపై వాహనాలు, దుకాణాల సామగ్రి పెట్టొద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, ట్రాఫిక్ సీఐ మురళీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వ్యాపార సముదాయాల ముందు అడ్డదిడ్డంగా పెట్టిన సామగ్రిని వారు శుక్రవారం తీసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా సామాగ్రి పెట్టవద్దని, పెడితే ఈ-పెట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పల్లెల్లో బోనాల సందడి



వడ్డేపల్లిలో బోనాల ఊరేగింపు

రాయపోల్, జూలై 12: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో పల్లెల్లోనూ బోనాల సందడి మొదలైంది. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో గురువారం రాత్రి పోచమ్మకు బోనాలు తీశారు. ఈ సందర్భంగా బోనాల ముందర పోతరాజుల విన్యాసాలు అలరించాయి. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

పీహెచ్‌సీలో మొక్కలు నాటిన సిబ్బంది



మొక్కలు నాటుతున్న వైద్యాధికారి రజిత

మద్దూరు, జూలై 12: డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు మండల కేంద్రం లోని పీహెచ్‌సీ వైద్యాధికారి రజిత సిబ్బందితో కలిసి కార్యాలయ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూడీసీ సుదయ్య, హెచ్‌ఎస్ హేమలత, ఫార్మాసిస్ట్ సందీప్, స్టాఫ్‌నర్స్ మాధవి, అటెండర్ యాదగిరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



హుస్నాబాద్‌రూరల్: పాపిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వర్గల్, జులై 12: మండలంలోని మైలారం జడ్పీహెచ్ఎస్ నుంచి బదిలీపై వెలుతున్న ఇద్దరు ఉపాధ్యాయులను గ్రామానికి చెందిన పలువురు నాయకులు, గ్రామస్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. పాఠశాలలో 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్రీలత, 6 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంజిరెడ్డి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి కనకయ్య, పోతగాళ్ల రవి, శ్రీనివాస్, ప్రభాకర్‌తో పాటు తదితరులు ఉన్నారు. మండలంలోని మజీద్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా పూడురు బాలమ్మ ఉద్యోగ విరమణ పొందడంతో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీపీ జాలిగామ లతరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ బబ్బురి లత శివరాములుగౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత బాలమ్మను ఘనంగా సన్మానించి సారే చీరలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యాదమ్మతో పాటు తదితరులు ఉన్నారు.



వర్గల్: ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ ఆయా బాలమ్మను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ

● కోహెడ: మండలంలోని చెంచల్‌చెరువుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, పరశురాములు, రమణ, సంపత్, రవీందర్‌రెడ్డి, సంజీవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుడుగు రాజేందర్, పాఠశాల చైర్మన్ మందస్వరూప, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్, హుస్సేన్, శంకర్, రాజు, కృష్ణ, రాజేశ్వరి, మాధవి, లత, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం రాములపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెలుతున్న బి పాపిరెడ్డికి విద్యార్థులు, ఉపాధ్యాయుల ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మాజీ సర్పంచ్ మదన్‌మోహన్‌రెడ్డి, ప్రత్యేకాధికారి రవికుమార్, తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలి

● బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మలికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్, జూలై 12: హుస్నాబాద్ పట్టణంలో నిబంధనల ప్రకారం ఎల్కతుర్తి, మెదక్ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణంలో కొందరి స్వార్థ కోసం రోడ్డు వెడల్పును తగ్గించి నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు.

'పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తాం'



నాచారం జడ్పీహెచ్ఎస్‌కు సౌండ్ సిస్టంను అందజేస్తున్న వెంకటేశ్‌గౌడ్

వర్గల్, జులై 12: నాచారం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని వర్గల్ మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు జాలిగామ వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం మైక్, సౌండ్ సిస్టం, ప్రాథమిక పాఠశాలకు స్రీన్, ప్రొజెక్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య

హుస్నాబాద్‌రూరల్, జూలై 12: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. హుస్నాబాద్ మండలం పందిల్లలో శుక్రవారం జీనిటౌన్‌షిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించిన వారిలో పదిమందిని ఎంపిక చేసి స్టీల్ వాటర్ బాటిల్ పంపిణీ చేయనునన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'



15వ వార్డులో మురికి కాలువలను పరిశీలిస్తున్న కౌన్సిలర్, వైద్యారోగ్యశాఖ అధికారులు

గజ్వేల్, జూలై 12: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య సూచించారు. మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు వీధుల్లోని మురికికాలువల్లో దోమల మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గునియా లాంటి అనేక వ్యాధులు బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నిరు. ఆయనవెంట వైద్యారోగ్యశాఖ సిబ్బంది దేవసాని వాసుదేవ్, డి.నాగరాజు, దుర్గాగౌడ్, రమేశ్, మునిసిపల్ సిబ్బంది, ఆశావర్కర్లు రాణి, నవనీత ఉన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా మండల కమిటీ నియామకం



ఎన్నికైన బీజేపీ కిసాన్‌మోర్చా కమిటీ సభ్యులు

కుకునూరుపల్లి, జూలై 12: బీజేపీ కిసాన్‌మోర్చా మండల కమిటీని బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి సమక్షంలో కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు గుర్రాలస్వామి ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా ఎలగారి ఆంజనేయులు, సాయికుమార్, కొక్కొండ రాజు, బుర్రి రాములు, ప్రధాన కార్యదర్శులుగా సున్నం కనకయ్య, గొడుగు కనకయ్య, నరేందర్, రొయ్యల స్వామి, పలువురిని కార్యదర్శులుగా, కోశాధికారులుగా నియమించారు. కార్యక్రమంలో దాసరి స్వామి, సదానందగౌడ్, గౌరారం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల పంపిణీ' డబ్బులు వెనక్కి ఇవ్వాలి

● కురుమ సంఘం కోహెడ మండల అధ్యక్షుడు కోనే శేఖర్



కోనే శేఖర్

కోహెడ, జూలై 12: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గొర్రెల పెంపకందారుల ఒక్కొక్కరు రూ. 43700 చొప్పున బ్యాంకులో జిల్లా కలెక్టర్ పేరు మీద డీడీ తీశారని ఆ డబ్బులను వెంటనే తిరిగి చెల్లించాలని కోహెడ మండల కురుమ సంఘం అధ్యక్షుడు కోనే శేఖర్ డిమాండ్ చేశాడు. విలేఖరులతో శుక్రవారం మాట్లాడారు. కొంతమంది అప్పులు చేసి మరీ డీడీలు చెల్లించరన్నారు. గొర్రెల కోసం బ్యాంకులో చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమని దరఖాస్తు చేసుకున్నప్పటికీ రోజులు గడుస్తున్నా డబ్బులు తమ ఖాతాల్లో జమ చేయడం లేదని గొర్రెల పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

● హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్, జూలై 12: మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో ఉన్న మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ సూచించారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేకంగా షీటీంలను ఏర్పాటు చేశామన్నారు. పోక్స్ చట్టాలు, బాల్య వివాహల నియంత్రణ, ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై సీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్‌మీడియా వల్ల కలుగుతున్న నష్టాలు, లాభాల గురించి వివరించారు. గంజాయి, మత్తుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం బృందం సభ్యులు సదయ్య, మహిళా హెడ్‌కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్ అభివృద్ధికి రూ. 20 కోట్లు..

హుస్నాబాద్, జూలై 12: హుస్నాబాద్ మున్సిపల్ అభివృద్ధి పనులకు టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ. 20 కోట్లు మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఆధునీకీకరణ, పట్టణంలో సుందరీకరణ పనులతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితతో పాటు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

దేవాదుల కాలువలో చెత్త, వ్యర్థాలు



కురుమసత్రం సమీపంలో కాలువలో పేరుకుపోయిన చెత్త

చేర్యాల, జూలై 12: కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని కురుమసత్రం ఆవరణగుండా నిర్మించిన దేవాదుల కాలువలో స్థానికులు చెత్త, చెదారం, వ్యర్థాలు పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. మూడునెలల జాతర సమయంతో పాటు ప్రతీ ఆది, బుధవారాల్లో మల్లన్న దర్శనార్థం కొమురవెల్లికి వచ్చిన భక్తులు రాంసాగర్ దారిలోని కురుమసత్రం, ఇతరత్రా ప్రైవేటు గదులలో అద్దెకు బస చేస్తున్నారు. చెత్త, చెదారాన్ని ఇళ్ల యాజమానులతో పాటు ఆరుబయట చెట్లనీడన బస చేస్తున్న భక్తులు కాలువలో పారబోస్తున్నారు.